సాక్షి
మెదక్
శనివారం ၊ 13 ၊ జనవరి ၊ 2024



నష్టాల పాలు
పాడి రైతులకు గత ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టినా, వాటికి నిధులు సకాలంలో విడుదలకాకపోవడంతో ప్రయోజనం లేకపోతోంది. వివరాలు 10లో ▸

ప్రత్యేక ఓటరు జాబితా..
రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ప్రత్యేక ఓటరు జాబితా నమోదు, సవరణకు జిల్లా అధికారులు వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.



వివరాలు 10లో ▸



పండగ పూట పస్తులే..
ప్రతీ ఒక్కరూ చదువుకోవాలన్న సదుద్దేశంతో పని చేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు జీతాలు రాక పండగ పూట అవస్థలు తప్పడం లేదు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

ఇనుప రెయిలింగ్‌లో తల ఇరుక్కొని..
బాలుడి నరకయాతన



చిల్వెర ఐబీ చౌరస్తాలో రెయిలింగ్‌లో తల ఇరుకున్న బాలుడు

అల్లాదుర్గం(మెదక్): హైవే ఇనుప రెయిలింగ్‌లో తల ఇరుకోవడంతో రెండు గంటల పాటు బాలుడు నరకయాతన అనుభవించాడు. ఈ సంఘటన శుక్రవారం అల్లాదుర్గం మండలం చిల్వెర ఐబి చౌరస్తా బ్రిడ్జి కింద జరిగింది. వట్‌పల్లి మండలం బూత్‌కూర్ గ్రామానికి చెందిన దంపతులు తమ కుమారుడితో బస్సు ఎక్కేందుకు నారాయణఖేడ్ వెళ్లేందుకు చిల్వెర ఐబీ చౌరస్తాకు వచ్చారు. బ్రిడ్జి కింద బాలుడు ఆడుకుంటూ రెయిలింగ్ మధ్యన తల పెట్టాడు. ఎంతకూ రాకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ప్రయత్నించినా వారి ప్రయత్నం ఫలించలేదు. చివరకు ఇనుప చువ్వలను తొలగించి బాలుడి తలను బయటకు తీయడంతో తల్లిదండ్రులు, ప్రయాణికులు ఊపిరి పిల్చుకున్నారు.

ఎన్‌పీఆర్డీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్డీ) తెలంగాణ రాష్ట్ర కమిటీ క్యాలెండర్‌ను అదనపు కలెక్టర్ రమేశ్ శుక్రవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు బస్వరాజ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టాలను అమలు చేయాలన్నారు. దివ్యాంగులకు మనోధైర్యం కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, వారిలో అక్షరాస్యత పెంచేందుకు ప్రత్యేక విద్యాసంస్థలు ఏర్పాటు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులను అన్ని రంగాల్లో భాగస్వామ్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ జిల్లా కార్యదర్శి యశోద తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుకు నీరు విడుదల



ఘనపురం ఆనకట్ట

మెదక్: మెదక్ జిల్లాలోని ఏకైక మధ్యతరహా ప్రాజెక్ట్ ఘనపురం ఆనకట్టకు శుక్రవారం ఇరిగేషన్ అధికారులు సింగూర్ నీటిని విడుదల చేశారు. మూడు రోజుల్లో ఘనపురం ప్రాజెక్ట్‌కు ఈ నీరు చేరుకోనున్నట్లు తెలిపారు. యాసంగి సీజన్‌లో మొదటి సారిగా 0.35 టీఎంసీ నీటిని విడుదలచేశామన్నారు. ప్రాజెక్ట్ పరిధిలోని పాపన్నపేట, కొల్చారం, హవేలీఘణపూర్, మెదక్ మండలాల పరిధిలో సుమారు 31 చెరువులను ఈ నీటితో నింపనున్నట్లు తెలిపారు. ఈ నీటితో సుమారు 25 వేల స్థిరాయకట్టు సస్యశ్యామలం కానుంది. ఇక నుంచి పంటలు చేతికొచ్చేంత వరకు పది రోజులకొకసారి నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. దీంతో అదనంగా మరో 5 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గణేష్ రవికుమార్



గణేష్ రవికుమార్

చేగుంట(తూప్రాన్): రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా చేగుంటకు చెందిన గణేష్ రవికుమార్ ఎన్నికైనట్లు జిల్లా క్రీడల యువజన అధికారి నాగరాజు శుక్రవారం తెలిపారు. హైదరాబాద్ కాచిగూడలోని జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో 16 జిల్లాల రగ్బీ అసోసియేషన్ కార్యదర్శులు సమావేశమై రాష్ట్ర అధ్యక్షుడిగా గణేష్ రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు పలు క్రీడల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు.

తరుముకొస్తున్న గడువు

ఇంకా మిల్లింగ్ కాని ధాన్యం
- గత వర్షాకాలానికి సంబంధించి 2.47 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి 1.95 లక్షలు ఎఫ్‌సీఐకి సరఫరా
- 31 వరకు సీఎంఆర్ పంపాలని ప్రభుత్వం ఆదేశం
- గడువులోగా పంపకుంటే మిల్లర్లపై శాఖాపరమైనా చర్యలు



గత వానాకాలానికి సంబంధించిన ధాన్యాన్ని వెంటనే మిల్లింగ్ చేసి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పంపాలని మిల్లర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు ఈనెల 31 వరకు గడువు విధించింది. గడవులోగా పంపకుంటే సదరు రైస్‌మిల్లులపై శాఖాపరమైనా చర్యలు తప్పవని ప్రభుత్వం ఆదేశించటంతో అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టారు. దీంతో మిల్లర్లు తర్జనభర్జన పడుతున్నారు.

– మెదక్

మెదక్ జిల్లాలో 2023 వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 3.49 లక్షల ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా 3,63,278 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అన్నదాతల నుంచి కొనుగోలు చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం జిల్లాలోని 158 రైస్‌మిల్లులకు ఇచ్చారు. ఇందుకు సంబంధించి 2,47,683 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,95,211 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మరాడించి ఇచ్చారు. ఈ లెక్కన 52,472 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో అవకతవకలకు పాల్పడిన మూడు రైస్‌మిల్లులను సీజ్‌చేసిన సంబంధిత అధికార యంత్రాంగం సదరు మిల్లుల యజమానుల ఆస్తుల జప్తునకు నోటీస్‌లు ఇచ్చి కొన్నింటిని జప్తు చేసింది. 155 మిల్లర్లు మిగిలిన బియ్యం ఇవ్వాల్సి ఉంది.

ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లర్లు?

సీఎంఆర్ కోసం ధాన్యాన్ని రైతుల నుంచి తీసుకున్న కొందరు మిల్లుల యజమానులు ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకున్నట్లు విశ్వాసనీయ సమాచారం. ప్రస్తుతం ఆ మిల్లర్ల వద్ద ధాన్యం స్టాక్‌లేదని వినికిడి. ఈనెల 31 నాటికి వానాకాలం ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని (సీఎంఆర్) ఎఫ్‌సీఐకి ఇవ్వాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవటంతోపాటు సదరు మిల్లులపై కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించటంతో అవకతవకలు పాల్పడిన మిల్లర్లు తర్జనభర్జన పడుతున్నారు.

5 వేల క్వింటాళ్లు ..

2022 వానా కాలానికి సంబంధించి కొందరు రైస్ మిల్లర్ల నుంచి 5 వేల క్వింటాళ్ల బియ్యం ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంది. వాటిని ఈ వారంలో ఇవ్వాలని అధికారులు హెచ్చరించారు. గడువులోగా ఇవ్వకుంటే సదరు మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టేందుకు వెనుకాడేది లేదని వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది.

ప్రక్షాళన షురూ

జిల్లాలో గతంలో రైస్ మిల్లర్లు, గోదాముల ఇన్‌చార్జిలు ఆడిందే ఆటపాడిందే పాటగా సాగింది. సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు ఎఫ్‌సీఐకి రెండు, మూడేళ్లయినా ఇచ్చేవారు కాదు. అలాగే జిల్లాలో మండల్ లెవల్ స్టాక్ (ఎంఎల్‌ఎస్) పాయింట్లలో విధులు నిర్వహించే ఇన్‌చార్జిలు వేలాది క్వింటాళ్ల బియ్యాన్ని దోపిడీ చేశారు. జిల్లాలో మొత్తం 7 ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉండగా వాటిలో రామాయంపేట, చేగుంట, మెదక్, తూప్రాన్‌ల ఇన్‌చార్జిలు, వాటిలో విధులు నిర్వహించే సిబ్బంది రూ.కోట్లు విలువచేసే బియ్యాన్ని దొడ్డిదారిన అమ్ముకున్నట్లు తెలిసింది. కాగా 2023 సెప్టెంబర్‌లో బదిలీపై జిల్లాకు వచ్చిన సివిల్ సప్లయ్ డీఎం గోదాములను తనిఖీలు చేయటంతో అసలు విషయం బయట పడింది. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. జిల్లాకు సదరు అధికారి వచ్చి సివిల్ సప్లయ్ శాఖలో ప్రక్షాళన మొదలు పెట్టడంతో అక్రమార్కులు ఆందోళన చెందుతున్నారు.

గత ఏడాది బియ్యం ఇవ్వాలి

గత ఏడాది వానాకాలానికి సంబంధించి ఇంకా 1.95 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంతో పాటు పాత బ్యాలెన్స్ మరో 5 వేల క్వింటాళ్లు ఈనెల 31 తేదీ నాటికి ఎఫ్‌సీఐకి ఇవ్వాలి. లేదంటే సదరు మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– హరికృష్ణ, సివిల్ సప్లయ్ అధికారి, మెదక్

31లోగా సీఎంఆర్ ఇవ్వాల్సిందే
- అలసత్వం చేసేవారిపై క్రిమినల్ కేసులు
- కలెక్టర్ రాజర్షి షా

మెదక్ కలెక్టరేట్: జనవరి 31లోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వాలని, ఇవ్వనివారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షి షా రైస్ మిల్లర్లకు తేల్చి చెప్పారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లో జిల్లాలో అధిక శాతం సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న రైస్ మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ కేటాయింపులపై చర్చించారు. ప్రభుత్వం ఈనెలాఖరు వరకు గడువు విధించినట్లు తెలిపారు. అప్పటిలోగా బియ్యం ఇవ్వని మిల్లుల యజమానులపై ఆర్ఆర్ యాక్ట్ కింద స్థిరచర ఆస్తులు జప్తు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. 13 నెలలు గడుస్తున్నా ఇంకా స్పందించని



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మిల్లర్ల అలసత్వాన్ని తీవ్రంగా పరిగణమిస్తామన్నారు. రైతుల నుంచి ప్రభుత్వపరంగా కొనుగోలు చేసి సమకూర్చిన ధాన్యాన్ని శరవేగంగా మిల్లింగ్ చేస్తూ ఈనెలాఖరులోగా నిర్దేశిత కోటాకు అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలను భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు చేరవేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కూడా వెనుకాడబోమని తేల్చిచెప్పారు. మిల్లర్లు పంపించే సీఎంఆర్ నిల్వలను వెంటనే దిగుమతి చేసుకునేలా గోడౌన్ల వద్ద కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, డీసీఎస్ఓ బ్రహ్మారావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి స్ఫూర్తితో ఎదగాలి

కలెక్టర్ రాజర్షిషా



నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

మెదక్ కలెక్టరేట్: స్వామి వివేకానందుడిని యువత స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'లక్ష్యంపై శ్రద్ధ.. ఆసక్తి, లక్ష్యసాధనపై కూడా చూపించాలి.. అదే విజయ రహస్యం' అన్న వివేకానందుడి మాటలు గుర్తు చేశారు. నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా బ్యూటీషన్, టైలరింగ్, సీసీ టీవీ రిపేర్, మొబైల్ సర్వీసింగ్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన 142 మందికి సర్టిఫికెట్స్ అందజేశారు.

రేట్‌చార్ట్‌పై అభిప్రాయం తెలపాలి

రేట్‌చార్ట్‌పై రాజకీయ పార్టీలు తమ అభిప్రాయం తెలపాలని కలెక్టర్ అన్నారు. శుక్రవారం లోకసభ ఎన్నికల నిర్వహణ కసరత్తులో భాగంగా స్పెషల్ సమ్మరీ రివిజన్ –2024 పై రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రేట్‌చార్ట్ పై రాజకీయ పార్టీల తమ అభిప్రాయాలను తెలపాలన్నారు. జిల్లాలో జనాభా ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాల పెంపు లాంటి అంశాలపై నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

భాగస్వాములు కావాలి

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏడీజీపీ సందీప్ శాండిల్య

మెదక్ మున్సిపాలిటీ: గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏడీజీపీ సందీప్ శాండిల్య పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణ, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన అంశాలపై సమీక్షించారు. దేశ భవిష్యత్‌ను నిర్ణయించే యువత గంజాయి, మత్తుపదార్థాల బారినపడకుండా వారిని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు పోలీసు కళాబృందంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. లాడ్జీలు, బస్టాండ్లు, కాలేజీలు, లేబర్ అడ్డాలు తదితర ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గతంలో గంజాయి, గుట్కా రవాణాకు పాల్పడిన వారు, గంజాయి సాగు చేసినవారి సమాచారాన్ని సేకరించడంతో పాటు వారి ప్రస్తుత



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

స్థితిగతులపై ఆరాతీయాలని చెప్పారు. గంజాయి రవాణాకు పాల్పడిన నిందితులపై పీడీయాక్ట్ నమోదు చేయాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే మెదక్ జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ 8712657888 నంబర్‌కు సమాచారం అందించాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల విషయంలో చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, జిల్లా సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకంతో | భూసారం తగ్గుదల

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్

నర్సాపూర్ రూరల్: పంటల సాగులో రైతులు రసాయన ఎరువులు అధికంగా వాడుతుండటంతో భూసారం తగ్గి భాస్వరం కరిగించే బాక్టీరియా లేకుండా పోతున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ మండలం సీతారాంపూర్ గ్రామంలో షెడ్యూల్ కులాల రైతులకు జీవన ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా షెడ్యూల్ కులాల రైతులకు భాస్వరం కరిగించే బాక్టీరియాను పంపిణీ చేశామన్నారు. డాక్టర్ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 40 మంది రైతులకు 2 లీటర్ల చొప్పున పంపిణీ చేసినట్లు తెలిపారు. రసాయనిక ఎరువులు అధికంగా వాడుతుండటంతో పెట్టుబడి ఖర్చు పెరుగుతోందన్నారు. భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియాను 500 మిల్లీలీటర్లకు తగినంత నీటిలో కలుపుకుని నాటు వేసేముందు సేకరించిన నారువేర్లను 20 నుంచి 30 నిమిషాలు ఉంచి తర్వాత నాటు వేసుకోవాలని సూచించారు. లేదంటే ఒక లీటర్



జీవన ఎరువులు పంపిణీలో పాల్గొన్న రైతులు, అగ్రికల్చర్ విద్యార్థులు

బ్యాక్టీరియాను 100 నుంచి 200 కిలోల మాగిన పశువుల పేడలో కలుపుకుని ఎకరం పొలంలో వెదజల్లుకోవాలన్నారు. కీటక నివారణ శాస్త్రవేత్త రవి కుమార్ వరి పంటలో చీడపీడలు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. యాంత్రీకరణ శాస్త్రవేత్త ఉదయ్‌కుమార్ డ్రోన్ ద్వారా వరి పంటలో పిచికారీ చేసే పద్ధతి, దాని ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతాం

- రైతులకు మళ్లీ కరెంట్ కష్టాలు తప్పేట్టు లేదు
- తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

మనోహరాబాద్(తూప్రాన్): బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడు ప్రజల పక్షాన పోరాడుతుందని, కేసీఆర్ అండతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లిలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత, సర్పంచ్ రేఖ, ఎంపీటీసీ స్వర్ణలతతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన జిల్లాలు, మండలాలు రద్దు, కొత్త విద్యుత్ పాలసీ తెస్తామనడం అభివృద్ధి తిరోగమనానికి సంకేతమన్నారు. రైతులకు సాగు కష్టాలు రాకుండా 24 గంటల ఉచిత కరెంట్ కేసీఆర్ ఇచ్చాడన్నారు. కాంగ్రెస్



జీడిపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ప్రతాప్‌రెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పురం మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి 16 వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

గజ్వేల్: స్థానిక మార్కెట్ కమిటీ పరిధిలోని సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్రాల్లో ఈనెల 13నుంచి 16వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేసినట్లు గజ్వేల్ మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కేంద్రాలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. తిరిగి ఈ నెల17 నుంచి పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభమవుతాయని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

స్టేడియం నిర్మాణానికి | నిధులు మంజూరు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో స్టేడియం ఏర్పాటుకు మంత్రి దామోదర రాజనర్సింహ నిధులు మంజూరు చేయించినట్లు దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన చేగుంటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల చేగుంట ప్రజాపాలనలో పాల్గొన్న మంత్రికి క్రీడాకారులు చేగుంటలో స్టేడియం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన ఆయన రూ.8.40 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ కాశబోయిన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

స్టేడియం నిర్మాణం కోసం పంచాయతీ రాజ్ ఈఈ నర్సింలు శుక్రవారం స్థల పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన చేగుంట మోడల్ కాలనీలో ఏర్పాటుచేయనున్న స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు య్యాయని, కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. త్వరలో నిర్మాణం పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

ఆ దరఖాస్తులకు మోక్షం ఎప్పుడో?

ప్రజాపాలనలో 2,73,489 స్వీకరణ
- ఇతర సమస్యలపై మరో 50,032
- ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు
- తెల్లకాగితం వివరాలు నమోదు చేపట్టని అధికారులు

మెదక్: కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన ఆరు గ్యారంటీల దరఖాస్తులను మాత్రమే ఆన్‌లైన్ చేస్తున్నారు. వాటితో పాటు అత్యధికంగా రేషన్ కార్డులు, ధరణి సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా దరఖాస్తు ఫారాలను ప్రజలకు అందజేసింది. ఇతర సమస్యలు ఉన్నవారు మాత్రం తెల్లకాగితంపై రాసి ప్రజాపాలన కౌంటర్‌లో ఇవ్వాలని సూచించారు. జిల్లాలో వేలాది మంది ఆరు గ్యారంటీల దరఖాస్తుతో పాటు ఇతర సమస్యలను తెల్ల కాగితంపై రాసి ఇచ్చారు. కానీ, అధికారులు మాత్రం ఈ దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం లేదు. దీంతో వాటికి మోక్షం ఎప్పుడు లభిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 2.73 లక్షల దరఖాస్తులు

ప్రజాపాలన సభల ద్వారా జిల్లా వ్యాప్తంగా 2,73,489 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో గ్యారంటీలకు సంబంధించి 2,23,357 వచ్చాయి. వాటిని యుద్ధ ప్రాతిపదికన ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈనెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. మున్సిపల్, తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా గ్రామీణాభివృద్ధి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థతో పాటు ప్రైవేట్‌గా పనిచేస్తున్న మొత్తం 480 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు గ్యారంటీల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే బాధ్యతలు అప్పగించారు. ఒక్కో ఆపరేటర్ 500 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కానీ, తెల్ల కాగితంపై రాసిచ్చిన దరఖాస్తులు మరో 50,032 రాగా వీటిని మాత్రం పక్కన పెట్టారు. ఇందులో రేషన్ కార్డుల దరఖాస్తులే అధికంగా వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. గ్యారంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు రేషన్ కార్డును తప్పనిసరి చేశారు. దీంతో చాలా మంది రేషన్ కార్డుల కోసం తెల్ల కాగితంపై మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. మహాలక్ష్మీ పథకం కింద ప్రతీనెలా రూ.2,500 ఆర్థిక సహాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడం కూడా రేషన్ కార్డుల దరఖాస్తులు పెరగడానికి మరో కారణం. మహాలక్ష్మీ, గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల్లో ఆధార్, రేషన్ కార్డుల నంబర్లు అడిగారు. అలాగే వాటి జిరాక్స్ ప్రతులను కూడా దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. ఇలా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేపట్టిన అధికారులు, తెల్ల కాగితంపై రాసి ఇచ్చిన దరఖాస్తులను ప్రస్తుతానికి పక్కన పెట్టారు. అయితే ఆ దరఖాస్తులను పరిశీలించి ఆయా శాఖలకు పంపిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు. వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



ఆరు గ్యారంటీల దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

సత్వర సేవలు.. అభినందనీయం

అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి


మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: పోక్సో, లైంగిక కేసుల్లో వేధింపులకు గురైన బాధితులకు సత్వర సేవలు అందించడం అభినందనీయమని అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలోని భరోసా సెంటర్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెంటర్‌లో పెండింగ్ ఉన్న అంశాలను త్వరగా పూర్తి చేయాలని త్వరలో సీపీ రివ్యూ నిర్వహిస్తారన్నారు. అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి రాష్ట్రస్థాయి అవార్డు


అవార్డుకు ఎంపికైన విగ్నేశ్

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి ఇంటింటా ఇన్నోవేటర్ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైనట్లు టీచర్ అశోక్ కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి విగ్నేశ్ కుమార్ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులు, వయోవృద్ధులు ఇబ్బంది పడకుండా వేసుకునేందుకు చొక్కా తయారు చేశాడని తెలిపారు. గతేడాది ఆగస్టు 15న మెదక్‌లో జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ప్రదర్శించగా రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు. 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా విగ్నేశ్‌కు నాగ్సాన్‌పల్లిలో అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


ఘటనా స్థలంలో యాదగిరి మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): ఒక వ్యక్తి బైక్‌పై వేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రంగంపేట గ్రామ శివారు మెదక్–జోగిపేట ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, కొల్చారం ఎస్‌ఐ గౌస్ తెలిపిన వివరాలు ప్రకారం మెదక్ నుంచి సంగారెడ్డికి బయలుదేరిన సంగారెడ్డి డిపోకు చెందిన అద్దె బస్సును, జోగిపేట వైపు నుంచి బైక్‌పై వస్తున్న సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి చెందిన పిట్ల యాదగిరి(42) ఎదురుగా వెళ్లి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో యాదగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసులో ఏడాది జైలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పోతారం (ఎస్) గ్రామానికి చెందిన బోయిని వంశీకి పోక్సో కేసులో ఏడాది జైలు శిక్ష, రూ.1,100ల జరిమానా విధిస్తూ శనివారం ఫస్ట్ అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం హుస్నాబాద్ స్టేషన్ పరిధిలో ఒక గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక తనను బోయిని వంశీ మానసికంగా, శారీరకంగా హింసించాడని గత నవంబరు 6న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ దాస సుధాకర్ కేసు నమోదుచేసి విచారణ ప్రారంభించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. తర్వాత ఎస్‌ఐ విచారణ పూర్తిచేసి నిందితుడిని జిల్లా పోక్సో కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువుకావడంతో జడ్జి వంశీకి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1,100ల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మహేశ్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, శివప్రసాద్, రాజమల్లును సీపీ అనురాధ అభినందించారు.

నష్టాల పాలు

పాడి రైతులకు ప్రోత్సాహకం కరువు

- లీటర్ పాలకు రూ.4 అందని వైనం
- జిల్లాలో రూ.5కోట్ల బకాయిలు
- 33నెలలుగా రైతుల ఎదురుచూపు
- మోయలేని భారంతో పశువుల అమ్మకం
- కొత్త ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

పాడి రైతులకు ప్రోత్సాహం కరువైంది. ప్రభుత్వం నుంచి ఆదరణ కరువై వారు ఆందోళన చెందుతున్నారు. ఆర్థిక చేయూతను అందించడానికి గత ప్రభుత్వం ప్రత్యేకంగా రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టినా, వాటికి నిధులు సకాలంలో విడుదలకాకపోవడంతో ప్రయోజనం లేకుండా పోతోంది. ఫలితంగా వ్యవసాయ అనుబంధరంగమైన పాడి రైతులు నష్టాల పాలవుతున్నారు. ఒక వైపు పెరుగుతున్న ధరలతో పశుపోషణ మోయలేని భారంగా మరింది. జిల్లాలోని రైతులకు ప్రభుత్వం కోట్ల బకాయిలు పడింది. ఆ నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. - వట్‌పల్లి(అందోల్)





జిల్లాలో పాల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం అందించాల్సిన లీటర్‌కు రూ.4 ప్రోత్సాహక బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోతున్నాయి. పాడి రైతుల నుంచి పాలసేకరణ జరిపే డెయిరీల్లో ప్రభుత్వరంగ విజయ డెయిరీనే ప్రధానం. నారాయణఖేడ్, జోగిపేట, జహీరాబాద్ పాల శీతలీకరణ కేంద్రాల పరిధిలో జిల్లాలోని 158 పాడిరైతు సహకార సంఘాల కేంద్రాల ద్వారా 4,892 మంది పాడి రైతుల నుంచి నిత్యం 16,233 లీటర్ల పాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వ డెయిరీ విజయపాల ఉత్పత్తిదారులకు మూడేళ్లుగా ప్రోత్సాహం అందకపోవడంతో సంగారెడ్డి జిల్లాలోనే రూ.5 కోట్ల బకాయిలు పేరుకుపోయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

33 నెలలుగా ఎదురుచూపులే..

పాడి రైతులను ప్రోత్సహించడానికి లీటరుకు అదనంగా రూ.4 ప్రోత్సాహాన్ని అందిస్తామని గత ప్రభుత్వం చెప్పడంతో పాడి రైతులు సంతోషించారు. చెప్పిన విధంగానే ఆలస్యమైనప్పటికీ 2020 ఏప్రిల్ వరకు మాత్రమే చెల్లించి చేతులెత్తేశారు. అప్పటి నుంచి దాదాపు 33 నెలలుగా ప్రోత్సాహం అందించడం లేదు. దీంతో చాలా మంది పాడి రైతులు పోషణభారం మోయలేక పశువులను విక్రయించుకున్నారు.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు..

పాడి పశువుల ధరలతోపాటు పశుగ్రాసం సాగు వ్యయం, దాణ, పోషణ, వైద్యం ఖర్చులు ఇబ్బడిముబ్బడిగా పెరిగి ఏమాత్రం గిట్టుబాటు కాని పరిస్థితి. మరో గత ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు విడుదల చేయకపోవడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. దాదాపు 20 వేలకు పైగా మంది రైతులకు రూ.5కోట్ల ప్రోత్సాహకం అందకుండా పోయింది. కొత్త ప్రభుత్వమైనా పాడి ప్రోత్సాహక బకాయిల నిధులను విడుదల చేస్తుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

డైయిరీ ఎండీని కలిసిన పాడి రైతులు..

పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న రూ.4 ప్రోత్సాహక నిధులను విడుదల చేయాలని కోరుతూ ఇటీవల ఆయా జిల్లాలకు చెందిన పాడిరైతులు విజయ డయిరీ ఎండీ ఇట్టెం లక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. పాల బిల్లులు కూడా సకాలంలో అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు పేర్కొనగా, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని రైతులు చెబుతున్నారు.


విజయడైరీ ఎండీ ఇట్టెం లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న పాడి రైతులు

బిల్లులు అందజేయాలి



ప్రభుత్వం ప్రకటించిన రూ.4 ప్రోత్సాహక నిధులు చెల్లించక 33 మాసాలు అవుతోంది. దీని వల్ల పాడి రైతులు ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున పాడి రైతుల ఇబ్బందులు తీర్చాలి. ప్రతి నెలా ఇచ్చే బిల్లులు కూడా ఒక్కమాసం పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రతి నెలా రెగ్యులర్‌గా వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- యాదగిరి, పాడిరైతు జోగిపేట బీఎంసీ

ప్రతిపాదనలు పంపించాం

విజయడెయిరీకి పాలు విక్రయించే రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. రూ.4 ప్రోత్సాహానికి సంబంధించిన డేటాను ఈ ల్యాబ్‌లో నమోదు చేస్తున్నాం. కొత్తగా విజయడైయిరీకి పాలుపోసే రైతులను కూడా ఈ ల్యాబ్‌లో ఎంట్రీ చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

- రంజిత్‌కుమార్, జోగిపేట బీఎంసీయూ మేనేజర్

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జరభద్రం

- సోషల్ మీడియాలో పోస్ట్ చేయకూడదు
- స్టేషన్‌లో సమాచారం అందించాలి
- పోలీసు కమిషనర్ డాక్టర్ అనురాధ


డాక్టర్ అనురాధ, సిద్దిపేట పోలీసు కమిషనర్

సిద్దిపేటకమాన్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని సొంత గ్రామాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ డాక్టర్ బి.అనురాధ సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలి. వారి వివరాలు నమోదు చేసుకుని ఆయా ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఊరెళ్లేవారు తమ ట్రావెల్ వివరాలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయకూడదని సూచించారు. తమ కాలనీలు, ఇళ్ల పరిసర ప్రాంతాలు, షాపింగ్ మాల్స్, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఆరు బయట పార్క్‌చేసే వాహనాలకు హ్యాండిల్ లాక్ చేసుకుని, తగిన భద్రత ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అనుమానితులు, కొత్త వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. దగ్గర్లోని పోలీసుస్టేషన్ నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఊర్లో వారు తమ విలువైన వస్తువులు, నగలు, నగదు ఇంట్లో ఉంచవద్దని సూచించారు. ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రజలు పోలీసుల సూచనలు పాటించి దొంగతనాల నివారణకు కృషి చేయాలన్నారు. ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూం 87126 67100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ముచ్చటగా మూడోసారి..

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయికి
- ఢిల్లీలో చాటిన హుస్నాబాద్ ఘనకీర్తి


ఎరువును తయారుచేసే విధానాన్ని పరిశీలిస్తున్న ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్

హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు హుస్నాబాద్ మున్సిపాలిటీ ముచ్చటగా మూడో సారి ఎంపికైంది. 2021లో మొదటిసారిగా ఫాస్టెస్ట్ మూవర్స్ సిటీ జాతీయ స్థాయిలో ప్రథమర్యాంక్ వరించింది. 2022లో దిబెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. 2023 సంవత్సరానికి గాను సౌత్‌జోన్‌లో క్లీనెస్ట్ సిటీలో 3వ స్థానం దక్కింది. ఇప్పటికే ఓడీఎఫ్ ప్లస్‌తో హుస్నాబాద్ ముందు వరుసలో ఉంది. డోర్ టూ డోర్ చెత్త సేకరణ, తడిపొడి చెత్త వేరుచేసే విధానం, పొడిచెత్త, తడిచెత్త సేకరణ, సేంద్రీయ ఎరువుల తయారీ, వార్డుల వారీగా స్వీపింగ్, పబ్లిక్ టాయిలెట్‌ల వినియోగం, సిటీ వాయిస్, సిటిజన్ ఫీడ్ బ్యాక్ వంటి అంశాలను పరిగణంలోకి తీసుకొని స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపిక చేస్తారు. సర్వేక్షణ్ కమిటీ సభ్యులు హుస్నాబాద్ పట్టణంలో సర్వే నిర్వహించారు. 2023లో దేశంలోని అన్ని పట్టణాలతో పోటీపడగా దక్షిణ భారత దేశంలో 15వేల నుంచి 25వేలలోపు జనభా గల పట్టణాల్లో హుస్నాబాద్ మున్సిపాలిటీకి క్లీనెస్ట్‌సిటీ విభాగంలో 3వ స్థానానికి ఎంపిక చేశారు. 9500 మార్కులకు గాను 6052 మార్కులు సాధించి హుస్నాబాద్ జాతీయ స్థాయి సౌత్‌జోన్‌లో మూడో స్థానానికి ఎంపికైంది.

ప్రజల భాగస్వామ్యంతోనే..

హుస్నాబాద్ మున్సిపాలిటీ మూడోసారి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని, ప్రజల భాగస్వామ్యంతోనే మంచి గుర్తింపు వచ్చిందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ఆనందం వ్యక్తం చేశారు. మరెన్నో అవార్డులు రావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాం.

దేశాభివృద్ధిలో విద్యనే కీలకం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు

దుబ్బాకటౌన్: దేశాభివృద్ధికి విద్యనే కీలకమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైశ్యభవన్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్మా నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మంచి మార్పులు వస్తాయన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రైవేట్ పాఠశాలలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆ యాజమాన్యాలకు అండగా ఉంటామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ట్రస్మా జిల్లా, నియోజకవర్గ బాధ్యులు మాలె రమేశ్, రేపాక విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథలైన చిన్నారులు

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


వినూత్న, సాత్విక

చిన్నశంకరంపేట(మెదక్): అనారోగ్య సమస్యతో తల్లితండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. నార్సింగికి చెందిన దంపతులు తమ్మారెడ్డి బాల్‌రెడ్డి, సుప్రియ అనారోగ్య సమస్యలతో ఒకరి తరువాత ఒకరు మృతి చెందారు. ఐదేళ్ల క్రితం బాల్‌రెడ్డి మృతి చెందగా, రెండు రోజుల క్రితం సుప్రియ మృతి చెందింది. దీంతో వారి ఇద్దరు చిన్నారులు వినూత్న, సాత్విక అనాథలయ్యారు. తల్లితండ్రులను కోల్పోయిన బాలికలు పెద్ద దిక్కును కోల్పోయి బిక్కుబిక్కుమంటున్నారు. వినూత్న మెదక్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. సాత్విక సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే సంక్షేమ గురుకులంలో ఏడోతరగతి చదువుతోంది. ఆ బాలికలు తమకు దాతలెవరైనా సహాయం చేయాలని కోరుతున్నారు. ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ 3000853971కు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

ప్రత్యేక ఓటరు జాబితా..

- రంగం సిద్ధం చేసిన అధికారులు
- స్వీప్ క్యాలెండర్ రూపకల్పన
- నేటి నుంచి 22 వరకు నిర్వహణ

నారాయణఖేడ్: రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ప్రత్యేక ఓటరు జాబితా నమోదు, సవరణకు జిల్లా అధికారులు వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. అందుకు స్వీప్ క్యాలెండర్‌ను రూపొందించి గ్రామాల్లో కచ్చితంగా అమలు చేయాలంటూ ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈనెల 22వరకు ఓటరు నమోదు చేపట్టాలని కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా శనివారం నుంచి ప్రతీ గ్రామంలోను, వార్డుల్లోను గ్రామసభలు నిర్వహించి ఓటరు జాబితా చదవడం, నూతన ఓటర్ల నమోదు, రంగోలీ పోటీలు నిర్వహించనున్నారు. మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో యువ ఓటర్లు, విద్యార్థులతో 2కే రన్, బైక్, సైకిల్ ర్యాలీలు చేపట్టనున్నారు. నియోజకవర్గ కేంద్రాలలో యువత, ఎన్‌జీఓలతో కలిపి 12, 13 తేదీల్లో గాలిపటాల పండుగను నిర్వహిస్తారు. 17న ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్ల ప్రదేశాలను సందర్శించి ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తారు. 18న కళాశాలల్లో విద్యార్థులను కలిసి యువ ఓటర్లుగా నమోదు చేయిస్తారు. 19లోపు స్పెషల్ ఎస్‌హెచ్‌జీ, జిల్లా, మండల సమాఖ్యలతో సమావేశాలు నిర్వహించి ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తారు. అలాగే సీనియర్ సిటిజన్లు, కార్మికులకు అవగాహన కల్పిస్తారు. స్వీప్ నోడల్ అధికారులు షెడ్యూల్ ప్రకారం కార్యకలాపాలు చేపట్టాలంటూ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు.

22 వరకు నమోదు..

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు డిసెంబరు 20 నుంచి జిల్లా వ్యాప్తంగా ఓటర్ల సవరణ చేపట్టారు. బూత్ స్థాయి అధికారులు(బీఎల్వోలు) ఇంటింటికీ తిరిగి 5వ తేదీ వరకు దరఖాస్తులు, సవరణల వివరాలు సేకరించారు. జనవరి 6న ముసాయిదా జాబితాను ప్రకటించారు. ఈ నెల 22 వరకు అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఉండగా ఎన్నికల సంఘం కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. ఫారం–6 ద్వారా కొత్తగా ఓటరు నమోదు, ఫారం–7 ద్వారా తొలగింపు, ఫారం–8 ద్వారా మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. 1 జనవరి 2024కు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. దానికి పోలింగ్ బూత్‌లేదా సీఈవో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు ఏప్రిల్–1, జూలై–1, అక్టోబర్–1 నాటికి 18 ఏళ్లు నిండనున్న వారు సైతం ఓటు కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. వారికి 18 ఏళ్లు నిండాకే జాబితాలో చోటు కల్పిస్తారు.

తప్పులు తొలగేనా..

గత శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో పలు చోట్ల ఓట్లు గల్లంతు కావడం, మృతి చెందినా, జిల్లా నుంచి బదిలీపై వెళ్లిపోయిన ఉద్యోగుల పేర్లు జాబితాలో కన్పించడం, స్థానికంగా ఉండి, ఓటరు గుర్తింపు కార్డు ఉన్నా జాబితాలో పేర్లు లేకపోవడం లాంటి సంఘటనలు వెలుగు చూశాయి. ఈ సారైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం



ఈ నెల 22 వరకు కొత్తగా ఓటరు నమోదు చేయడం, పేర్ల తొలగింపు, మార్పులు చేర్పులకు అవకాశం ఉంది. 20, 21వ తేదీల్లో గ్రామాల్లో స్పెషల్ క్యాంపెయినింగ్ బూత్ స్థాయిలో నిర్వహిస్తాం. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా రంగోలి, 2కే రన్ తదితర కార్యక్రమాలు ఉన్నాయి. స్వయం సంఘాల గ్రూపులతో పండగ తర్వాత సమావేశాలు నిర్వహించి వందశాతం ఓటరు నమోదు జరిగేలా చూస్తాం.

- వెంకటేశ్, ఆర్‌డీఓ, నారాయణఖేడ్

చెత్తగా.. తరలింపు..

పట్టణంలోని చెత్తను తరలించడంలో కనీస నిబంధనలను పాటించడం లేదు. ట్రాక్టర్ ట్రాలీ వెనుక డోర్ కూడా లేకుండా చెత్తను తరలిస్తున్నారు. దీనివల్ల ఆ చెత్తా చెదారం వాహనదారులపై పడి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



సైబర్ వలలో ఉద్యోగి

- టాస్కులు, కమిషన్‌ల పేరుతో మోసం
- రూ.1.12 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించిన ఓ ఉద్యోగి రూ.1.12 లక్షలు పోగొట్టుకున్న ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి జనవరి 7న టెలిగ్రామ్ ద్వారా పార్ట్‌టైం జాబ్‌కు చెందిన మెసేజ్ వచ్చింది. దానికి స్పందించిన ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్‌చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.5 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు దపదపాలుగా మొత్తం రూ.1.12 లక్షలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని బాధితుడు అడగగా నేరగాడు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ పైనుంచిపడి వ్యక్తి మృతి


కిష్టయ్య(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): ప్రమాదవశత్తు బైక్ నుంచి పడిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గౌరైకల్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్తివాడ కిష్టయ్య(45) గురువారం మండలంలోని బిజిలీపూర్ గ్రామంలో బంధువులకు చెందిన అంత్యక్రియలకు హాజరై స్వగ్రామానికి చేరుకోగానే ప్రమాదవశాత్తు బైక్ నుంచి పడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గ మధ్యమంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలుకిందపడి..

తూప్రాన్: రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బ్రాహ్మణపల్లి రైల్వేగేటు సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. బ్రాహ్మణపల్లికి చెందిన ఎరుకల యాదగిరి(40) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

హత్యకేసులో భర్తనే సూత్రధారి

ఇద్దరు నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

నారాయణఖేడ్: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన అంజుమ్‌బేగం కేసు మిస్టరీ వీడింది. భర్తనే హత్యకు సూత్రధారిగా తేలింది. సీఐ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఈత్వార్‌పేట్‌కు చెందిన సయ్యద్ యూనుస్‌కు భార్య ఉండగా అంజుమ్‌బేగం(30)ను రెండో వివాహం చేసుకుని ఖేడ్‌లోని అద్దె ఇంట్లో ఉంచాడు. ఈనెల 8న ఆమె అద్దె ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉంది. ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరపగా హత్యగా తేలినట్లు సీఐ వివరించారు. మొదటి భార్యను సొంత ఇంట్లో ఉంచి తనను మాత్రం అద్దె ఇంట్లో ఉంచడం, అలాగే ఆస్తిలో సగం వాటా కావాలని ఆరు నెలలుగా అంజుమ్‌బేగం తన భర్త యూనుస్‌తో గొడవ పడింది. దీంతో తనకు ప్రశాంతత లేకపోగా చంపేస్తే ఆస్తి ఇచ్చే పరిస్థితి తప్పుతుందని యూనుస్ ఈనెల 6న తన అన్న కుమారుడైన అయూబ్‌తో కలిసి ఆమెను చంపాలని పథకం రచించాడు. ఈనెల 8న మధ్యాహ్నం అయూబ్ తన స్నేహితుడైన మరో మైనర్‌తో కలిసి అంజుమ్‌బేగం ఇంటికి వెళ్లాడు. బయట మైనర్‌ను ఉంచి అయూబ్ ఇంట్లోకి వెళ్లి బెడ్‌రూంలో ఉన్న అంజుమ్‌బేగంపై దాడి చేశాడు. ఆమె కిందపడిపోగా బెడ్‌రూం నుంచి వంటగదిలోకి లాక్కునివచ్చి ఫ్లోరింగ్ క్లీన్‌చేసే పరికరం ప్లాస్టిక్‌వైపర్‌తో తలవెనుక గట్టిగా కొట్టడంతో ఆమె మృతిచెందింది. ఆ విషయాన్ని ఫోన్‌లో చెప్పగా యూసుఫ్ వారిని బీదర్‌కు పారిపొమ్మని చెప్పాడు. ఈ క్రమంలో పోలీసులు శుక్రవారం నిందితులను పట్టుకుని కోర్టుకు హాజరుపర్చారు, కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.